క్లుప్తంగా

లోక్ అదాలత్‌లో 530 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న ఏడీజే శ్రీహరి

గుత్తి: పట్టణంలోని ఏడీజే, సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఏడీజే శ్రీహరి, సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్ చారి 503 కేసులను పరిష్కరించారు. బాధితులకు రూ. 3,47,45,000 నష్ట పరిహారం ఇచ్చేలా తీర్పు వెలువరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు రామ శర్మ, పీడీ రత్నం, ఏపీపీ బుసా సుధీర్‌రెడ్డి, ఏజీపీ తిమ్మారెడ్డి, న్యాయవాదులు ఎంవీ మహేష్ కుమార్, ఫక్రుభాష, సతీష్, నూర్, దనుంజయ, విజయ భాస్కర్, చంద్ర కాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా లోక్ అదాలత్‌కు హాజరైన వారికి లయన్స్ క్లబ్ సభ్యులు భోజన వసతి కల్పించారు.

100 రోజుల్లోనే నష్ట పరిహారం అవార్డు

యాక్సిడెంట్ కేసులో కేవలం వంద రోజుల్లోనే నష్టపరిహారం అవార్డు చేస్తూ ఏడీజే శ్రీహరి తీర్పు వెలువరించారు. వివరాలు సెప్టెంబర్ 20, 2024న గుత్తి మండలం కొత్తపేట బ్రిడ్జి సమీపంలో ఆటో బోల్తా పడి వ్యాపిలికి చెందిన కూలీ నరసింహులు మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును సీనియర్ న్యాయవాది ఎంవీ మహేష్‌కుమార్ వాదించారు. ఈ క్రమంలో శనివారం ఏడీజే మృతుడి కుటుంబానికి రూ.13.70 లక్షల పరిహారం అవార్డు చేస్తూ తీర్పు చెప్పారు.

228 కేసుల పరిష్కారం



కేసులను పరిష్కరిస్తున్న జడ్జి ప్రతిభ

గుంతకల్లుటౌన్: స్థానిక జేఎఫ్‌సీఎం కోర్టు హాల్‌లో శనివారం మొదటి అదనపు సివిల్ జడ్జి ఈ.ప్రతిభ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో రాజీపడదగిన 228 కేసులను పరిష్కరించినట్లు కోర్టు అధికారులు తెలిపారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు సంబంధించి-50 కేసులు, రైల్వే కోర్టు-12 కేసులు, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు సంబంధించిన 162, పీఎల్‌సీ-4తో కలిపి మొత్తం 228 కేసులు పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు నాగేషు, గోపాలక్రిష్ణ, ఏపీపీ సుహాసిని, న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

విద్యా నిలయాలు కేంద్రీయ విద్యాలయాలు



కేంద్రీయ విద్యాలయంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

గుత్తి: విద్యా నిలయాలు కేంద్రీయ విద్యాలయాలు అని గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ మల్కీ సాబ్ అన్నారు. పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో శనివారం కేంద్రీయ విద్యాలయం 62వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రెండు, మూడు, నాలుగు తరగతుల చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అతిథులు మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాల్లో చదువుకునే విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్ ఉంటుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో బాగా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో టీచర్లు శ్రీనివాసులు, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఫసల్ బీమా గడువు పొడిగించాలి



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

తాడిపత్రి అర్బన్: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన బీమా పథకం గడువును డిసెంబర్ 30 వరకూ పొడిగించాలని రైతు సంఘం డిమాండ్ చేసింది. శనివారం నంద్యాల రోడ్డులోని స్థానిక కార్యాలయంలో రైతు సంఘం కార్యదర్శి రాజారామిరెడ్డి మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులకు సంబంధించి ప్రీమియం ప్రభుత్వమే చెల్లించిందని, కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులే ప్రీమియం చెల్లించాలని చెప్పడం దారుణమన్నారు. తాడిపత్రి చుట్టుపక్కల ప్రాంతాల్లో పెంగల్ తుఫాను వల్ల గత 20 రోజుల నుంచి వాతావరణం అనుకూలంగా లేకపోవడం వల్ల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, దీంతో చాలా మంది రైతులు బీమా చేసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం స్పందించి బీమా గడువును ఈనెలాఖరు వరకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జయశేఖర్‌రెడ్డి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం



తాడిపత్రి పెన్నానదిలో ప్రవహిస్తున్న మురుగు



బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం పక్కన మురుగు ప్రవాహం



భూగర్భజలాలు కలుషితం కావడంతో పెన్నానదిలోని ఓ బోరులో వస్తున్న కలుషిత నీరు

- పెన్నాలోకి మురుగు నీరు
- కలుషితమవుతున్న భూగర్భజలాలు
- ఆందోళనలో పట్టణ ప్రజలు

తాడిపత్రిటౌన్: పెన్నానదిలో పారుతున్న మురుగు నీటి కారణంగా తాగునీరు కలుషితం అవుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే తాడిపత్రి చరిత్రకు తలమానికంగా నిలుస్తున్న బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయానికి సైతం మురుగు తాకుతుండటంతో భక్తులు, పట్టణ ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాడిపత్రి పట్టణంలో 36 వార్డులు, 78 కాలనీలు, దాదాపు 32 వేల కుటుంబాలు, 1.30 లక్షల మంది జనాభా ఉన్నారు. పట్టణంలోని మురుగు పెన్నానదిలో కలుస్తుండటంతో భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాయ్ పార్కు నుంచి బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం వరకూ బైపాస్ రోడ్డు పై వెళ్లాలంటే ముక్కు మూసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. సమీప కాలనీ వాసులు దుర్వాసనకు ఇళ్లల్లో వుండలేక పోతున్నామని వాపోతున్నారు.

భక్తులకు ఇబ్బంది..

బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయం పక్కనే మురుగు ప్రవహిస్తుండటంతో ఆలయంలోకి దుర్వాసన వస్తోంది. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దుస్థితి. కార్తీక మాసం, శ్రావణ మాసం, శివరాత్రి పర్వదినాల్లో ఆలయానికి భక్తులు పోటెత్తుతారు. మురుగు, దుర్వాసన కారణంగా ఆలయంలో ప్రశాంతంగా ఉండలేక పోతున్నామని భక్తులు వాపోతున్నారు. మురుగు కారణంగా పట్టణంలో భూగర్భ జలాలు కలుషితం కావడంతో పలు చర్మవ్యాధులు ప్రబలుతున్నాయి. కొళాయి నీటిని తాగునీటి అవసరాలకు ఉపయోగించుకోలేని పరిస్థితి నెలకొందని మహిళలు వాపోతున్నారు. దీంతో వాటర్‌ప్లాంట్లు, ట్యాంకర్ల నుంచి నీరు కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వామపక్ష నాయకులు, ప్రజా సంఘాల నాయకులు వాపోయారు. అధికారులు స్పందించి పెన్నాలో మురుగునీటి ప్రవాహానికి అడ్డుకట్టవేసి సమస్యను పరిష్కరించాలని పట్టణ వాసులు కోరారు.

నీరు కలుషితమవుతోంది



పెన్నాలో ప్రవహిస్తున్న మురుగు నీటి కారణంగా భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయి. దీంతో బోర్లలో నీరు వాడుకోలేని పరిస్థితి. చర్మవ్యాధులు వస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకొని మురుగు సమస్యను పరిష్కరించి భూగర్భజలాలు కలుషితం కాకుండా చూడాలి. – రేవతి, అంబేద్కర్ నగర్, తాడిపత్రి

ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు



పెన్నానదిలో మురుగు నీటి సమస్య కారణంగా పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జలాలు కలుషితం అయి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పెన్నానది పరిసర కాలనీ ప్రజలు దుర్వాసనతో ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి. అధికారులు, ప్రజా ప్రతినిధులు తక్షణం చర్యలు తీసుకోవాలి.

– చిరంజీవి, సీపీఐ నాయకుడు, తాడిపత్రి

ఏకపక్షంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

తాడిపత్రి, శింగనమల, గుంతకల్లు నియోజకవర్గాల్లో శనివారం నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకపక్షంగా సాగాయి. పోలింగ్ కేంద్రాల వద్ద కూటమి నాయకులు హల్‌చల్ చేశారు.



బుక్కరాయసముద్రం పొడరాళ్లలో ఎన్నికైన వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు

తాడిపత్రి రూరల్: మండలంలోని శనివారం సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలో చిన్నపోలమడ, పెద్దపోలమడ, భోగసముద్రం, నందలపాడు, పెద్దపోలమడ, దిగువల్లి, ఆలూరు, వెంకటాంపల్లిలో ఎన్నికలు నిర్వహించగా వంగనూరు సాగునీటి సంఘం ఎన్నిక వాయిదా పడింది. మిగిలిన సంఘాల్లో అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

యాడికి: మండలంలోని పిన్నేపల్లి చెరువు అధ్యక్షుడిగా వేలూరు విశ్వేశ్వర రావు, వైస్ ప్రెసిడెంట్‌గా పుల్లారెడ్డి, రాయలచెరువు చెరువు అధ్యక్షురాలిగా నాగశేషమ్మ, ఉపాధ్యక్షుడిగా నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారి సలీంబాషా, ఎన్నికల అధికారులు మహబూబ్‌బాషా, ఎంపీడీఓ వీరారెడ్డి తెలిపారు. సీఐ ఈరన్న, ఎస్‌ఐ వెంకటరమణ, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

పెద్దవడుగూరు: పెద్దవడుగూరు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా రవిశంకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మోహన్‌కృష్ణారెడ్డి, దిమ్మగుడి సాగునీటి సంఘం అధ్యక్షుడిగా దిమ్మగుడి రాజారెడ్డి, ఉపాధ్యక్షుడిగా కె.సూర్యనారాయణరెడ్డి, పామిడి మండలం గజరాంపల్లి అధ్యక్షుడిగా పి.జయప్రకాష్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలిగా భూమిక, అప్పేచర్ల సాగునీటి సంఘం అధ్యక్షుడిగా గుర్రప్ప వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా గుర్రప్ప వెంకటనారాయణ, చిత్రచేడు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా నాగేశ్వర, ఉపాధ్యక్షుడిగా లచ్చప్ప ఎన్నికయ్యారని తహసీల్దార్ ఉషారాణి తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్‌ఐ ఆంజనేయులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బుక్కరాయసముద్రం: మండలంలో బీకేఎస్ చెరువు, రెడ్డిపల్లి, దండువారిపల్లి, సిద్దరాంపురం, కేకే అగ్రహారం, చెన్నంపల్లిలో రెండు చెరువులు ఉన్నాయి. అదే విధంగా హెచ్‌ఎల్‌సీ ఆయకట్టు చెన్నంపల్లి, కొర్రపాడు, జంతలూరు, పొడరాళ్ల ఉన్నాయి. సిద్దరాంపురం గ్రామంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి వర్గీయులు సాగునీటి సంఘం ఎన్నికల్లో నిలబడలేదు. ద్విసభ్య కమిటీ సభ్యుల మద్దతుదారులు మాత్రమే నిలబడ్డారు. పొడరాళ్లలో నిర్వహించిన ఎన్నికల్లో టీడీపీ నాయకులు దౌర్జన్యానికి పాల్పడ్డారు. పొడరాళ్ల 6,7 వార్డుల్లో టీడీపీ పార్టీ మద్దతు దారులు లేకపోవడంతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు సాకే తిప్పన్న, ఈశ్వర ప్రసాద్ ఏకగ్రీవంగా డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్, ముసలన్న, సమక్షంలో డిక్లరేషన్ ఫారాలను అందుకున్నారు. పొడరాళ్ల గ్రామంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యటించారు.

పుట్లూరు: పుట్లూరు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా పాటిల్ సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా రవికుమార్, కడవకల్లు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాసులునాయుడు, ఉపాధ్యక్షుడిగా లింగమూర్తి, శనగలగూడూరు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా పెద్దనాగిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా రంగనాథరెడ్డి, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధికారులు ప్రకటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ అలివేలమ్మ, ఎంఈఓ శ్రీదేవి, అధికారులు పాల్గొన్నారు.

యల్లనూరు: యల్లనూరు, కల్లూరు, తిరుమలాపురం, వేములపల్లి గ్రామాల్లో శనివారం సాగునీటి ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు తహసీల్దారు రాజా, డిప్యూటీ తహశీల్దారు మునీంద్ర తెలిపారు. యల్లనూరు ఆయకట్టు చైర్మన్‌గా ఆదిశేషు నాయుడు (జంగంపల్లి), వైస్ చైర్మన్‌గా పి. శ్రీనివాసులరెడ్డి (కృష్ణాపురం), తిరుమలాపురం ఆయకట్టు చైర్‌పర్సన్‌గా ప్రమీలమ్మ(కోమటికుంట్ల), వైస్ చైర్మన్‌గా నారాయణస్వామి (గరుగుచింతలపల్లి), వేములపల్లి ఆయకట్టు చైర్మన్‌గా సదాశివారెడ్డి(నిట్టూరు), వైస్ చైర్మన్ లింగుట్ల రామాంజనేయులు (పీఎం కొండాపురం), కల్లూరు ఆయకట్టు చైర్మన్‌గా మేకల వెంకటనాయుడు(కల్లూరు), వైస్ చైర్మన్‌గా రాజశేఖర్‌రెడ్డి(పాతపల్లి)తో పాటు 12 మంది డైరెక్టర్లను ఎన్నుకున్నారు. యల్లనూరులో నాలుగు స్థానాలకు సంబంధించి డైరెక్టర్ పదవులు పెండింగ్ పడ్డాయి. కార్యక్రమంలో పీబీసీ ఏఈ హర్షవర్ధన్‌రెడ్డి, టీబీసీ ఏఈ తిప్పేస్వామి, ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, ఏఓ రామకృష్ణ, ఈఓఆర్డీ మనోహర్, ఏపీవో షబ్బీర్‌బాషా , పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, గార్లదిన్నె: మండలంలో సాగు నీటి సంఘాల ఎన్నికలు సజావుగా నిర్వహించినట్లు తహసీల్దార్ ఈరమ్మ పేర్కొన్నారు. యర్రగుంట్ల, గార్లదిన్నె, ఇల్లూరు గ్రామాల్లో సాగు నీటి కాలువలకు ,పెనకచెర్ల, యర్రగుంట్ల, జంబులదిన్నె, మర్తాడు చెరువులకు సంబంధించి డైరెక్టర్లు, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించామన్నారు.

నార్పల: మండల కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం సాగునీటి సంఘం ఎన్నికలు సజావుగా నిర్వహించినట్లు తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సాగు నీటి సంఘం అధ్యక్షుడిగా పరంధామ, ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నికయ్యారు.

గుంతకల్లులో ఎన్నికలు బహిష్కరించిన వైఎస్సార్‌సీపీ

గుంతకల్లు రూరల్: మండలంలో శనివారం నిర్వహించిన ఆయకట్టు సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. కూటమి ప్రభుత్వ దౌర్జన్యకాండను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ సాగునీటి సంఘాల ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ఆపార్టీ నాయకులు శనివారం గుంతకల్లు మండలంలో జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలకు దూరంగా ఉన్నారు. దీంతో మండలంలోని నాగసముద్రం, పాతకొత్తచెరువు, వైటీ చెరువు సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. వైటీ చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా ఇమ్మడి రామదాసు ఎన్నిక కాగా, పాతకొత్తచెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా రామచంద్ర, నాగసముద్రం సాగునీటి సంఘం అధ్యక్షుడిగా మునిస్వామి ఎన్నికైనట్లు అధికారులు తెలిపారు.

గుత్తి రూరల్: మేజర్ సాగునీటి సంఘాలైన పెద్దొడ్డి 1, 2, 3లకు అధ్యక్షులుగా రామకృష్ణ, కేపీ.నాగరాజు, డి.నాగరాజు, మాముదూరు సంఘానికి అధ్యక్షుడిగా నేసే.శ్రీనివాసులు, మార్నేపల్లి అధ్యక్షుడిగా రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి కొత్తపేట చెరువుకు నాగభూషణం, మాముడూరుకు రఘునాథరెడ్డి, ఊబిచెర్లకు బోయ శ్రీనివాసులు, బాచుపల్లికి ఎస్.రంగస్వామి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. తహసీల్దార్ ఓబిలేసు పర్యవేక్షణలో అధికారులు రవినాయక్, మొహరున్నీసాబేగం, ముస్తాక్ అహ్మద్, మల్లేష్‌నాయక్, మద్దిలేటి, విజయకుమార్ ఎన్నికలను సజావుగా నిర్వహించారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ సురేష్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

గుత్తి: గుత్తి చెరువు కట్ట (సాగునీటి సంఘం) ఎన్నికలు శనివారం ఏకగ్రీవమయ్యాయి. అధ్యక్షుడిగా కేశవ నాయుడు, ఉపాధ్యక్షుడిగా హనుమంత రెడ్డి, ఎన్నికయ్యారు.

పామిడి: పామిడి మేజర్ సాగునీటి సంఘానికి సంబంధించి అధ్యక్షుడిగా మీనుగా వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా కోవేలిదిన్నె మారుతి వరప్రసాద్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఎద్దులపల్లి మేజర్ సాగునీటి సంఘానికి అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా మజ్జిగ నరసింహులు, కేఆర్ గోవిందురాజులు, అనుంపల్లి మైనర్ సాగునీటి సంఘానికి అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా నీలప్పగారి లక్ష్మన్న, కంచం సుంకయ్య; రామగిరి మైనర్ సాగునీటి సంఘానికి అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా వీ సుదర్శన్‌బాబు, రమావత్ కేశవ్‌నాయక్, పాళ్యం మైనర్ సాగునీటి సంఘానికి అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా బైనేని లక్ష్మన్న, పూలవారి నారాయణస్వామి ఎన్నికయ్యారు. ఎన్నికలను తహసీల్దార్ ఎన్ శ్రీధరమూర్తి పర్యవేక్షించారు. సీఐ యుగంధర్ బందోబస్తు పర్యవేక్షించారు.

ఘనంగా దత్త జయంతి



గుంతకల్లులో షిర్డీసాయినాథుడికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



తాడిపత్రిలో తులసిమాల అలంకరణలో దత్తాత్రేయుడు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఆలూరు రోడ్డు వద్ద ఉన్న షిర్డీసాయిబాబా ఆలయంలో శనివారం దత్త జయంతి, ఆలయ 19వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు కాగడ హారతి, పంచామృతాభిషేకం, గణపతి హోమంతో పాటు సాయిదత్త వ్రతం తదితర పూజాకార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తిమ్మప్ప, ఉపాధ్యక్షుడు పాటిల్ మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: స్థానిక గాయత్రీదేవి ఆలయం, సాయిబాబా ఆలయం, దత్త మందిరం, యర్రగుంటపల్లి గ్రామంలోని దత్త ఆశ్రమంలో దత్త జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ఉదయమే సుప్రభాత సేవలతో మొదలుకుని దత్తాత్రేయ స్వామి, సాయిబాబా మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. దత్తాత్రేయ స్వామితో పాటు సాయిబాబాకు విశేష పూజలు చేశారు. దత్తపారాయణం, హోమాది కార్యక్రమాలను నిర్వహించారు. దత్త ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని గౌతమేశ్వరాలయంలో శనివారం దత్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీషిడియి సాయి బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక వాహనంలో స్వామి వారి ఉత్సవ విగ్రహం పల్లకీ ఉంచి ఊరేగింపు(గ్రామోత్సవం) చేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు వినియోగం చేశారు.

పామిడి: పట్టణంలోని దత్త మహాయోగ పీఠంతో పాటు మండలంలోని రామరాజుపల్లి గ్రామ దత్త దేవాలయంలో శనివారం వేర్వేరుగా దత్తజయంతి నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు.



గుత్తి ఆర్ఎస్‌లో దత్త జయంతి నిర్వహిస్తున్న దృశ్యం



పామిడిలోని దత్త మహాయోగ పీఠంలో దత్తాత్రేయ విగ్రహాలను అలంకరించిన దృశ్యం

ప్రీ క్రిస్మస్ వేడుకల సందడి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఆలూరు రోడ్ సెయింట్ పాల్ స్కూల్ ఆవరణలో జెమ్స్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెమ్స్ సంస్థ అధినేత, ఐఈసీ చర్చి పాస్టర్ స్టీఫెన్ జోసెఫ్, జబర్దస్త్ ఫేమ్ రాజమౌళి కేక్‌ను కట్ చేసి చిన్నారులకు స్వీట్లు పంచిపెట్టారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. క్రీస్తు గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో జెమ్స్ సంస్థ ప్రతినిధులు డిసి.శేఖర్, శ్రీనివాస్ హెర్బర్ట్, సభ్యులు, భక్తాదులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

పామిడి: పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో ఉన్న ఆర్డీటీ స్కూల్‌లో ఈనెల 18న సాయంత్రం నిర్వహించే సెమీ క్రిస్మస్ వేడుకలను జయప్రదం చేయాలని కాలనీవాసులు శనివారం కోరారు. స్థానిక బందెల వారి ఆధ్వర్యంలో కసుంపల్లి పాస్టర్ రెవరెండ్ డానియల్ అధ్యక్షతన నిర్వహించే ఈ వేడుకలకు గుంటూరు బైబిల్ మిషన్ ఏఓ రెవరెండ్ బందెల రాజు ముఖ్య ప్రసంగీకులుగా విచ్చేయనున్నారన్నారు. అలాగే పట్టణంలోని సీఎస్‌ఐ చర్చిలో ఈ నెల 22న సాయంత్రం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే క్యాండిల్‌లైట్ సర్వీసుతో పాటు సెమీ క్రిస్మస్ వేడుకలను జయప్రదం చేయాలని పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ శనివారం తెలిపారు. సెమీ క్రిస్మస్ కేక్ కటింగ్‌తో పాటు ప్రేమ విందు ఉంటుందన్నారు.



గుంతకల్లులో సందేశాన్నిస్తున్న చర్చి ఫాస్టర్ స్టీఫెన్ జోసెఫ్

కంప్యూటర్, క్రాఫ్ట్ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యా మండలి ద్వారా సాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే కంప్యూటర్, క్రాఫ్ట్ కోర్సులకు ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ డైరెక్టర్లు ఓబిరెడ్డి, గజలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. శిక్షణ పూర్తయిన విద్యార్థులకు 2025 మార్చి, ఏప్రిల్‌లో పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. ఈ సర్టిఫికెట్ ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్-2, 3, 4 నాన్‌ఎగ్జిక్యూటివ్ పోస్టులు, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ తదితర ఉద్యోగాలకు ఉపయోగపడుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో చోటు చేసుకుంది. ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొంది. ప్రమాదంలో పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన యోగా, సురేష్, జ్ఞానేశ్వర్ తీవ్రంగా గాయపడ్డారు. ఆటోను తప్పించబోయి బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని ప్రమాదం సంభవించింది. యోగా అనే యువకుడిని వైద్యుల సలహా మేరకు అనంతపురం రెఫర్ చేశారు. సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కష్టపడి చదివితే బంగారు భవిష్యత్



ముస్లిం, మైనార్టీ గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఏ షరీఫ్

గార్లదిన్నె: విద్యార్థులు కష్టపడి చదివితే బంగారు భవిష్యత్తు ఉంటుందని ఏపీ మైనార్టీల ప్రభుత్వ సలహాదారులు, శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ సూచించారు. శనివారం స్థానిక ముస్లిం, మైనార్టీ గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించి, తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడారు. 440 మంది విద్యార్థులు ఉండగా తరగతి గదులు, వసతిభవనాలు, మౌళిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు మొర పెట్టుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో తరగతులు నిర్వహిస్తున్నామని, పాఠశాల నిర్వహణకు సొంత భవనం కేటాయించాలని ప్రిన్సిపాల్ ఆంజనేయులునాయక్, ఉపాధ్యాయులు ఆయనకు విన్నవించుకున్నారు. వెంటనే స్పందించిన ఆయన జిల్లా ఉన్నతాధికారులు, ముస్లిం, మైనార్టీ శాఖ అధికారులతో మాట్లాడి విద్యార్థులకు మౌలిక వసతులు ఏర్పాటు, సొంత భవనం నిర్మించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ముస్లిం, మైనార్టీ నాయకులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు



మజ్జిగ రాజశేఖర్, ఎంపీటీసీ

పామిడి: మండలంలో ఐదు సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకపక్షంగా నిర్వహించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టని రామగిరి ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్ తప్పు బట్టారు. మొత్తం 42 మంది సభ్యుల ఎన్నికకు అధికార పార్టీ దర్పంతో పోలీసులను అడ్డుపెట్టుకుని మిగతా వారి నుంచి నామినేషన్లు వేయకుండా ఈ ఎన్నికలను ఏకగ్రీవంగా నిర్వహించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అన్నారు. అధికారేతర ప్రజా ప్రతినిధులను ఎవ్వరిని పోలింగ్‌బూత్‌ల వద్దకు రానీయ్యకుండా మరీ తలుపులు వేసుకొని ఈ ఎన్నికలు చేపట్టడం శోచనీయమన్నారు. అలాంటప్పుడు అధికారులు ఇలాంటి ఎన్నికల హంగామా చేపట్టాల్సిన అవసరమేముందన్నారు.

నెట్టికంటుడిని దర్శించుకున్న హంపి పీఠాధిపతి



ఆలయంలో స్వామిని స్మరించుకుంటున్న హంపి పీఠాధిపతి

గుంతకల్లు రూరల్: హంపి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య విద్యారణ్య భారతి స్వామీజీ శనివారం సాయంత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామీజీ వారు నెట్టికంటుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలను ఆయనకు అందజేశారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

తాడిపత్రిటౌన్: పట్టణంలోని శ్రీసాయి చైతన్య స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక అయినట్లు కోచ్ లక్ష్మీనరసింహ తెలిపారు. పాఠశాలకు చెందిన గౌతమి, సుహాన ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 22న తూర్పుగోదావరిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఎంపికైన క్రీడాకారులను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.